క్లుప్తంగా

ఉచిత దంత వైద్య శిబిరం



కర్లపాలెం: దేవీ శరన్నవరాత్రులలో భాగంగా స్థానిక పెద్దింటమ్మ కల్యాణ మండపంలో సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో బాపట్లకు చెందిన ప్రముఖ దంత వైద్యుడు హనుమంతరావు సుమారు వంద మందికి ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించి దంతక్షయం నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చి మందులు అందజేశారు. కార్యక్రమంలో సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కృష్ణం రాజు, సాంబయ్య ఉన్నారు.

సాయిబాబాకు పూజలు



రేపల్లె: సాయిబాబా సమాధి కార్యక్రమాన్ని పట్టణంలోని పలు ఆలయాల్లో మంగళవారం నిర్వహించారు. ఓల్డ్‌టౌన్ అంకమ్మ చెట్టు వెనుక ఉన్న సాయిబాబా ఆలయంలో, అంబేడ్కర్ పార్కు సమీపంలోని సాయిబాబా ఆలయంలో దీపపు వెలుగులో బాబా సమాధిని పువ్వులతో అలంకరించారు. ఆయా ఆలయాల్లో సాయి చాలీసా పారాయణం, సాయినామం జపంతో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

ఏడుగురు జూదరులు అరెస్ట్

రేపల్లె రూరల్: కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని బేతపూడి గ్రామ శివారులో మంగళవారం జరిగింది. ఎస్ఐ నవీన్‌కుమార్‌కు అందిన సమాచారంతో బేతపూడి గ్రామంలో పోలీసులు దాడులు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.13,110 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

కర్లపాలెం: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. మంగళవారం రాత్రి పోలీసులు కర్లపాలెంలో పేకాటాడుతున్న ఐదుగురి అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.29,800 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

కూల్‌డ్రింక్ అనుకొని గడ్డి మందు తాగిన వృద్ధురాలు

చికిత్స పొందుతూ మృతి

కొల్లూరు: గడ్డి సంహారక మందుని కూల్‌డ్రింక్‌గా పొరబడి తాగిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తిప్పలకట్టకు చెందిన బొడ్డు కమలమ్మ (70) ఈనెల 18న పొలంలో పనికి వెళ్లింది. పంట పొలంలో గట్ల వెంబడి పెరిగిన గడ్డిని సంహరించేందుకు మందును పిచికారీ చేసేందుకు కూల్‌డ్రింక్ సీసాలో మందు పోసుకుని, పొలం గట్టు మీద ఉంచడంతో ఆ సీసాను చూసిన కమలమ్మ కూల్‌డ్రింక్‌గా భావించి తాగింది. మొదటి గుటక వేసిన అనంతరం పురుగుల మందుగా గ్రహించి ఊసివేసినప్పటికీ అపస్మారక స్థితికి చేరుకోవడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అప్పట్నుంచి చికిత్స పొందుతున్న వృద్ధురాలు పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. వైద్యశాల నుంచి అందిన నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కొల్లూరు పోలీసులు పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



కొల్లూరు: ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన కొల్లూరు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వేమూరు మండలం బేతేశుపురంకు చెందిన అల్లి నాగేశ్వరరావు (52) సోమవారం మండలంలోని ఈపూరులో ఉంటున్న అల్లుడు, కుమార్తెల ఇంటికి వచ్చి తిరిగి తన మోపెడ్‌పై మనవడు, మనవరాళ్లని తీసుకుని స్వగ్రామం వెళుతున్నాడు. కొల్లూరు–ఈపూరు చిన్న కాల్వ కట్ట మార్గంలో వెళుతున్న నాగేశ్వరరావును ఎదురుగా కొల్లూరు వైపు నుంచి ఇటుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ట్రాక్టర్ చక్రాల కిందపడి ఘటనా ప్రాంతంలోనే మరణించాడు. ప్రమాద సమయంలో ద్విచక్ర వాహనంపై ఉన్న మృతుడి మనవడు, మనవరాళ్లు ప్రదీప్, ప్రవళికలు ఎగిరి రోడ్డు పక్కకు పడటంతో స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. సంఘటనా ప్రాంతంలో మృతుడి భార్య, బంధువుల రోదనలతో విషాదకర వాతావరణం నెలకొంది. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పోలీసుస్టేషన్‌లో లొంగిపోయాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.


వైభవంగా విజయద'శమి'



జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, అరుణభాస్కరి దంపతులు



ప్రత్యేక పూజలందుకుంటున్న గ్రామదేవత బూరుగులమ్మ..



వెల్లటూరులో రాజరాజేశ్వరి అలంకారంలో కనకదుర్గమ్మ..



పెదపులివర్రులో బాలా త్రిపురసుందరిగా..



గుళ్లపల్లిలో శమీ పూజ చేస్తున్న మనోజ్ అఖిలాండేశ్వరి దంపతులు



దసరా మహోత్సవం సందర్భంగా జమ్ములపాలెంలో ప్రత్యేక పూజల్లో భక్తులు



భక్తులకు పసుపు కుంకుమ అందిస్తున్న నిర్వహకులు

రేపల్లె రూరల్/చెరుకుపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రేపల్లె గ్రామదేవత బూరుగలమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించారు. మధ్యాహ్నం నుంచి అమ్మ బూరుగులమ్మ అలంకరణలో భక్తులను కటాక్షించారు. ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో భ్రమరాంబ అమ్మవారు, పేటేరులోని శ్రీమహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవార్లు భక్తులకు మహిషాసురమర్దని అలంకరణలో దర్శనమిచ్చారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు–అరుణ భాస్కరి దంపతులు దసరా వేడుకల్లో పాల్గొని అమ్మవారికి, జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించారు. అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేశారు. స్వయంభూరామలింగేశ్వరస్వామి ఆలయంలో నెలకొల్పిన బతుకమ్మ అమ్మవారికి మహిళలు అధిక సంఖ్యలో పూజలు చేశారు. అమ్మవారి పూజలో పాల్గొన్న మహిళలకు కాశేపల్లి ఈశ్వరరావు–భారతలక్ష్మి దంపతులచే చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి మండలంలో..

గుళ్లపల్లి గ్రామంలోని గాంబికా సమేత ఆనందీశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారాయణ చైర్మన్ ఓగిరాల వీరాస్వామి తెలిపారు. సోమవారం రాత్రి పొన్నపల్లి సత్యన్నారాయణ కుమారుడు మనోజ్ అఖిలాండేశ్వరి దంపతుల చేతులమీదుగా శమీ పూజా మహోత్సవం, మంగళవారం శాంతి కల్యాణం నిర్వహించారు అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ భట్టు లింగేశ్వరరావు, ఉలగుంట సాంబశివరావు, జంపాని శ్రీనివాసరావు, గుర్రం వెంకటేశ్వరరావు, ఉల్లంగుంట శివరామకృష్ణ, కాటూరి శ్రీనివాసరావు, బేతపూడి రమేష్, బొర్రు శ్రీనివాసరావు, అర్చకులు ప్రయాగ రాంబాబు శర్మ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి నమోస్తుతే...

భట్టిప్రోలు: భట్టిప్రోలులో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. జై దుర్గా భవాని గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలలో భాగంగా ఉదయం కుంకుమ పూజ, రాత్రి శమీపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెల్లటూరులో శ్రీ అశ్వథ్ నారాయణ మహాలక్ష్మి దేవతా వన వృక్షం వద్ద అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెదపులివర్రులోని రాజరాజ నరేంద్ర స్వామి వారి దేవాలయంలో బాలా త్రిపురసుందరి, పేరిందేవి, గ్రామ దేవత గోగులమ్మ అమ్మవార్లు, వేమవరంలో రుక్మాభాయి సహిత పాండురంగ స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు, పార్వతి అమ్మవార్లు మహిషాసురమర్దని దేవి అలంకారాలలో దర్శనమిచ్చారు. రాత్రి బాలా త్రిపురసుందరి నృత్య కళా నిలయం (అవనిగడ్డ) నాట్యాచార్యులు బాడిగ అనిల్ కృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులచే కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. భట్టిప్రోలు–అద్దేపల్లి ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ముత్తయిదువులకు అమ్మవారి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, గాజులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా, నిర్వాహకులు టి.నాగసుధారాణి పర్యవేక్షించారు. శ్రీ షిర్డీ సాయిబాబా 105వ ఆరాధనోత్సవాలలో భాగంగా బాబా వారికి అన్నాభిషేకం, సహస్ర నామార్చన నిర్వహించారు. రాత్రి భక్తి గీతాల ఆలాపన జరిగింది.

దసరా మహోత్సవంలో భాగంగా శమీ పూజ

బాపట్ల: దసరా మహోత్సవం సందర్భంగాలలితా త్రిపురసుందరీపీఠం ఆధ్వర్యంలో శమీ పూజ నిర్వహించారు. ఉదయం 'మహిషాసుర మర్దిని' గా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుబేర కుంకుమార్చన, మరువంతో, పూలతో పూజ, నవవిధ నివేదనలు జరిగాయి. సాయంత్రం శమీ పూజ జరిగింది. పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు, పండితులు పంగులూరి కౌండిన్య శర్మ విశేష అర్చనలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దర్శి ప్రశాంత్, వక్కలగడ్డ బాలాజీ, కృష్ణగౌడ్, చుండూరు నాగేంద్ర గుప్తా పాల్గొన్నారు.

జమ్ములపాలెంలో ప్రత్యేక పూజలు

జమ్ములపాలెంలో గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం వద్ద దసరా ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు సామూహిక వత్రాలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పెద్దింటమ్మకు పూజలు

కర్లపాలెం: దేవీ శరన్నవరాత్రులలో భాగంగా గ్రామదేవత పెద్దింటమ్మ అమ్మవారికి భక్తులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి చేరుకుని గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశారు. పలు రకాల పూలమాలలతో, నిమ్మకాయ దండలతో అమ్మవారి విగ్రహాన్ని అలంకరించారు. పసుపు కుంకుమలు, పూలు, పండ్లు సమర్పించారు. పొంగళ్లు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయం వద్ద ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

వైభవంగా ముగిసిన దేవీ శరన్నవరాత్రులు

కర్లపాలెం: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు మండలంలో అత్యంత వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజులుగా పూజలందుకున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు మంగళవాయిద్యాలు, కనకతప్పెట్లతో నగరోత్సవం నిర్వహించారు. నగరోత్సవానికి వచ్చిన అమ్మవారికి భక్తులు పూజలుచేసి కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చారు. ఉత్సవాల ముగింపులో భాగంగా ఆయా గ్రామాలలో అమ్మవారి వేదికల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ వేదికల నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు భక్తులను అలరించాయి.

పీవీ పాలెంలో..

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండలంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. అల్లూరులోని రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకారం చేసి పూజా కార్యక్రమాలు జరిపించారు. చందోలులోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో బండ్లమ్మవారిని తొలుతగా సమస్త భక్తజనులు విజయములను అనుగ్రహించే మాతగా రజిత, కవచ అలంకారం చేసి మహిషాసుర మర్దినిగా ఏకకాలంలో ఉభయ మాతలుగా దర్శనమిచ్చారు. పరిసర గ్రామాల నుండి భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

బండ్లమ్మ అమ్మవారి సేవలో ఎమ్మెల్యే కోన రఘుపతి



పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అమ్మవారిని దర్శించుకున్నారు. విజయదశమి సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీపీ షేక్ బాజీ, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.



భట్టిప్రోలులో రాజరాజేశ్వరి దేవి అలంకారంలో కనకదుర్గమ్మ..



ప్రత్యేక అలంకరణలో ఉన్న పెద్దింటమ్మ..



చందోలులో మహిషాసుర మర్దినిగా దర్శనమిస్తున్న బండ్లమ్మవారు



చందోలులో రజత కవచ అలంకారంలో దర్శనమిస్తున్న బండ్లమ్మవారు



అల్లూరులో రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు..



సమ్మెటవారిపాలెంలో పూజలందుకున్న కనకదుర్గమ్మ అమ్మవారు

అమెరికా తెలుగు సాహితీ సదస్సులో రవీంద్రనాథ్



పుస్తకాలను ఆవిష్కరించిన డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పక్కన రవీంద్రనాథ్

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, పరిశోధకుడు ముత్తేవి రవీంద్రనాథ్ అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం, మిల్పిటస్ నగరంలో 21, 22 తేదీల్లో జరిగిన 13వ అమెరికా తెలుగు సాహితీ సదస్సులో పాల్గొన్నారు. ×తెలుగు సంస్కృతి– ఒక పరిచయం® అంశంపై ప్రత్యేక ప్రసంగం చేశారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సిలికాన్ ఆంధ్ర యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో అదే యూనివర్సిటీలో జరిగిన సదస్సుకు అమెరికాలోని పలు రాష్ట్రాలు, కెనడా, బ్రిటన్ దేశాల్నుంచి పలువురు రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. శతాబ్దాల తెలుగు జాతి ఉత్కృష్టమైన సంస్కృతిని స్థూలంగా వివరించిన రవీంద్రనాథ్, జనజీవనంలోని మానవీయమైన అంశాలు మాత్రమే కాలపరీక్షకు తట్టుకుని నిలబడి, ఆ జాతి జనుల సంస్కృతి అంతర్భాగం కాగలవని చెప్పారు. అనాగరిక, అమానవీయ, అశాస్త్రీయమైన ఆచారాలు, విశ్వాసాలు, సామాజిక కట్టుబాట్లు కాలక్రమంలో కలిసిపోక తప్పదని సోదాహరణంగా వివరించారు. రవీంద్రనాథ్ రచన ×తెనాలి రామకృష్ణకవి–శాస్త్రీయ పరిశీలన® పునరుద్ధరణ ప్రతిని, తాజా రచన ×కరణీకం® గ్రంథాన్నీ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు. తెనాలికి చెందిన ప్రసిద్ధ రచయిత ఆచార్య కొలకలూరి ఇనాక్, నిర్వాహకులు డాక్టర్ వంగూరి చిట్టెన్‌రాజు, డాక్టర్ కూచిభొట్ల ఆనంద్, డాక్టర్ సి.మృణాళిని సమక్షంలో రవీంద్రనాథ్‌ను సత్కరించారు.

● తీరంలో.. దసరా సరదా



బాపట్ల అర్బన్: సూర్యలంక తీరం పర్యాటకులతో కళకళలాడింది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం దసరా సందర్భంగా రెండు రోజులపాటు సెలవులు ప్రకటించింది. దీంతో పాటు పాఠశాలలు సెలవులు కావడం, ఉద్యోగస్తులకూ సెలవులు రావడంతో కుటుంబ సమేతంగా సూర్యలంక తీరానికి వచ్చి ఆహ్లాదంగా గడిపారు. అధిక సంఖ్యలో రావడంతో పోలీసులు తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు. తీరంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. యువత అలలపై కేరింతలు కొడుతూ సందడి చేశారు.



వైఎస్సార్ సీపీ బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి

కర్లపాలెం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామాజిక న్యాయ బస్సు యాత్రను విజయవంతం చేద్దామని బాపట్ల ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకుల, కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు అధ్యక్షత వహించారు. సీతారామిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల వారికి అత్యధికంగా పదవులు కేటాయించి సామాజిక న్యాయం చేశారని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బస్సు యాత్ర ఈనెల 28వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు కర్లపాలెం సెంటర్‌కు వస్తుందని మండల పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ అభిమానులు విచ్చేసి బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి మందపాటి పరమానందకుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్‌బేగ్, గణపవరం సర్పంచ్ దేవరకొండ అంకమ్మ, ఆట్ల పెద్ద శ్రీనివాస రెడ్డి, గొర్ల సుబ్బారావు, షంషీర్, గొర్రుముచ్చు మీరయ్య, కంకిపాటి నాగరాజు, మార్పు బెనర్జి, కాగిత మహేష్, షేక్ తాజుద్దీన్, మార్పు బెనర్జి, స్వామిరెడ్డి, జయభారత్‌రెడ్డి, సుభాస్ చంద్రబోస్ పాల్గొన్నారు.

స్టీల్ క్యారేజీలు అందజేత



వెల్లటూరు ఎస్టీ కాలనీలో స్టీల్ క్యారేజీలు అందచేస్తున్న నిర్వాహకులు

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని ఎస్టీ కాలనీలో ప్రతి ఇంటికి ప్రముఖ పారిశ్రామికవేత్త వేములపల్లి రవికిరణ్ మంగళవారం స్టీల్ క్యారేజీలను అందజేశారు. రూ. 40వేలతో కాలనీల్లోని ప్రతి ఒక్కరికీ ఈ క్యారేజీలను అందించారు. అదే విధంగా పొట్లూరి కట్లమ్మ మృతి చెందడంతో రవికిరణ్ మిత్ర బృందం తరపున రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థిని కీర్తికి రూ. 25వేలు, ముమ్మనేని నితిన్ సాయికి రూ. 20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అమృతలూరు మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్, వెల్లటూరు సర్పంచ్ చౌటూరి లక్ష్మి, నిర్వాహకులు కాట్రగడ్డ గోపాల్, రాయన రవితేజ, అమృతలూరి రవి, వీరంకి నాగరాజు, మల్లిపెద్ది సాకాత్, వాకా రాజేష్, గమిని నర్సింగ్, ఆరేపల్లి నర్సింగ్, అద్దేపల్లి ప్రవీణ్, ఏ.రవి, నార్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

27న జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ

తెనాలిఅర్బన్: జీఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జరగనున్న జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ కరపత్రాలను వైఎస్సార్‌సీపీ ఒకటోవ వార్డు కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపై యువత ఆసక్తిని చూపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు నాలాది ప్రభాకర్, నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు, గెడ్డేటి మహేష్, సీమోను, అబజిత్, విలియమ్స్, ప్రభాకర్, భాస్కర్, ప్రకాష్, తేజ పాల్గొన్నారు.

నేడు వెల్లటూరులో ఏకలవ్య విగ్రహ ఆవిష్కరణ

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరులో బుధవారం గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏకలవ్య విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం జరుగుతుందని శ్రీ కట్లమ్మ తల్లి ఏకలవ్య సంఘం నిర్వహకులు మంగళవారం తెలిపారు. స్థానిక లాక్ సెంటర్‌లో జరగనున్న విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. విగ్రహాన్ని కొల్లూరు మండలం జువ్వలపాలెంకు చెందిన వేములపల్లి రవికిరణ్ అందించగా గ్రేస్ ఫౌండేషన్ చైర్మన్ కైతేపల్లి షాలేమ్ రాజు అన్నదానానికి సరుకులు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కర్రసాధనం, కోలాటం, సోది చెప్పుట, ఈత బుట్టల అల్లిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.